# లక్షాధికారైన లవణమన్నమే కాని...

లక్షాధికారయిన లవణమన్నమెకాని
వెండి బంగారంబు కుడువలేదు...
కుడువ లేదు...
కూడబెట్టిన ధనము వెంటరాదు...
తుదకు దొంగలకిత్తురో దొరల కిత్తురో
రాగం తీస్తూ పద్యం చరణాలను పాడుతూ




డా॥ కాలువ మల్లయ్య

నడుస్తున్నాడో వ్యక్తి. "వెండిబంగారంబు కుడువ లేదు... కుడువలేదు..." అని నొక్కి నొక్కి చదువుతున్నాడు.

మంత్రులతో, అనుయాయులతో కొలువు దీరున్న ప్రభువు పాటో, పద్యమో తెలియని ఆ చరణాలను వింటున్నాడు. ప్రభువు అలా వినడం అదే మొదటిసారికాదు.

'ఎవరక్కడ...?' కేకేసాడు ప్రభువు...

ప్రభువంటే ఏదో రాజ్యానికి రాజేం కాదు...

ప్రజలచేత ఎన్నుకోబడ్డవాడే...

అయినా అతనికి ప్రభువులా ప్రవర్తించడమే ఇష్టం... కోట్లాదిమంది ఓట్లేసి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు కాబట్టి తాను రాజుకంటే కూడా ఎక్కువేనని అతని నిశ్చితాభిప్రాయం.

గిట్టనివాళ్ళు అతన్ని హిట్లరన్నా పట్టించుకోడు. అతని నోటి నుంచి మాట వెలువడిందో లేదో సేవకుడు పరుగెత్తుకొచ్చి వినయంగా నిల్చున్నాడు.

"పాటపాడుతూ పోతున్నదెవరు...?"

"ప్రభూ...! అతడో బిక్షకుడు... యోగిలాంటివాడు... తాత్విక సంబంధమైన పాటలు పాడుతూ తిరుగుతుంటాడు... ఎవరినీ నోరు తెరిచి అడగడు... పెడితే తింటాడు... లేకుంటే పస్తుంటాడు..."

"అతన్నిటు తీసుకురండి..." ఆజ్ఞాపించాడు.

"అడుక్కునే అతన్నెందుకు ప్రభూ పిలవడం..."

"హూ... అధిక ప్రసంగం..." హూంకరింపు.

"చిత్తం ప్రభూ...!" పరుగెత్తారు భటులు. అతని కనుసన్నల్లో మెదిలే వాళ్ళంతా చుట్టూ కూర్చున్నారు.

"మన నగరంలో బిచ్చగాళ్లు లేకుండా చేసాం కదా...?" ప్రశ్నార్ధకంగా చూసాడు ప్రభువు.

"మనకు అప్పులిచ్చిన ప్రభువులు మన పట్టణాన్ని సందర్శించిన సమయంలో బిచ్చగాళ్లు కనబడకుండా తరిమేసాం. మళ్ళీ తిరిగొచ్చారు. వాళ్ళను అప్పుడే నిర్మూలించాల్సింది..." అన్నాడు మంత్రి.

"ప్రతిపక్షాలంటూ ఏడ్చాయి కదా...?" అన్నాడు పేదరిక (పేదల) నిర్మూలనా మాత్యులు.

"ప్రతిపక్షాలు అన్నిటికీ అడ్డు తగులుతున్నాయి. అవి లేకుండా చేస్తే...?" గుంభనగా నవ్వుతూ అన్నాడు ప్రభువు.

"మనం మరోసారి గెలిస్తే అదే జరుగుతుంది. కానీ ప్రజాస్వామ్యమంటూ ఏడ్చింది కదా..." అన్నాడు పోలీసు మంత్రి.

"ప్రజలు ఇలాగే వెడ్డివెడ్డిగా ఉన్నంత వరకూ పేరుకే ప్రజాస్వామ్యం... ఏమంటారు...?"

"అవును ప్రభూ...! అందులో సందేహమేముంది...?" అన్నాడు వార్తల మంత్రి...

తాను దగ్గినా, తుమ్మినా, ఆఖరకు గ్యాస్ ట్రబుల్‌తో బాంబు వేసినా బాగు... బాగు... అనే వందిమాగధ స్తోత్రగాళ్లే ఆ ప్రభువుకు ప్రధాన అనుచరులు...

వాళ్ళకు ఆయన చెప్పిందే వేదం... మాట్లాడిందే శిలాక్షరం.

యధా రాజ తధా ప్రజగా ఉండాలన్నదే ఆ ప్రభువు వాంఛ...

"సార్... ప్రభూ...! ఇదుగో లక్ష్మయ్య పంతులును తీసుకొచ్చాం... మీ ముందు

నిలబెట్టాం..." అన్నారు భటులు.

ప్రభువు తలూపగానే వాళ్ళు నిష్క్రమిం చారు.

లక్ష్మయ్య పంతులనబడే ఆ భిక్షకుణ్ని పైనుంచి కింది వరకూ చూసాడు ప్రభువు.

బాగా పెరిగి, మాసిపోయిన గడ్డం, మీసాలు... తలవెంట్రుకలు... చిరుగుల లాల్చీ, పాత ధోతీతో తపోభంగమైన మౌనిలా ఉన్నాడు. బతికి చెడిన వాడిలా ఉన్నాడు. అతని గూర్చి ఇంకా తెలుసుకొని తన విలువైన సమయాన్ని పాడు చేసుకోదలుచుకోలేదు రాజావారు...

"నువ్వేవో పాట పాడుతున్నావు... అదేంటి...?" సూటిగా ప్రశ్నించాడు.

"నాకు వచ్చిన, నాకు నచ్చిన నగ్న సత్యాల్లాంటి పద్యపాఠాలు... మీకు నచ్చలేదా ప్రభూ ఈ పాఠాలు..."

"లక్షాధికారయినా లవణమన్నమే తింటాడా...? అదెప్పటి మాటో...?"

"కొన్ని మాటలు కాలాతీతంగా నగ్నసత్యాలన్న విషయం మీకు తెలియదా ప్రభూ...!"

ఇప్పుడు యంత్రాలతో, సైన్సుతో ఎంతో ముందుకు పోయాం. వైర్‌లెస్‌లు, రోబోట్ల నుంచి కంప్యూటర్ల వరకూ ఎదిగాం. మేము పాలకులమైన తరువాత మరీ అభివృద్ధి సాధించాం. నువ్వు పాడే పాట కాలినడకనో, బండ్ల మీదనో పయనించే కాలం నాటిది. ఇప్పుడు లక్షలాది మైళ్ల దూరంలో ఉన్న వ్యక్తితోనయినా ఒక్క క్షణంలో మాట్లాడవచ్చు. ఏ దేశంలో జరుగుతున్న విషయాన్నయినా అదే సమయంలో తెలుసుకోవచ్చు. లక్షకు విలువేముంది...? సగర్వంగా అన్నాడు ప్రభువు.

"అయితే ఇపుడు కోటీశ్వరుడయినా, రాజాధిరాజయినా కంప్యూటర్లు, విమానాలు కుడువలేడు అని పాడాలంటారా...? అయినా అర్థం అంతే కదా...!"

ధిక్కారమా అన్నట్టు తనలో తాను గొణుకున్నాడు ప్రభువు... "యథా రాజా... తథా ప్రజా అన్న విషయాన్ని గమనించడం లేదు మీరు. ఇలా అయితే కష్టపడాల్సి వస్తుంది..." అన్నాడు.

"నాకంటూ ఏమీ లేనివాణ్ని... ఏ రోటికాడ పాట ఆ రోటికాడ పాడాల్సిన అవసరం నాకేముంది...?

మీరు రాజునని భావిస్తున్నారు కాబట్టి యథా రాజా తథా ప్రజా అంటున్నారు. ప్రజా ప్రతినిధినని భావిస్తే, ప్రజలే మీకు అధికారం ఇచ్చిన వాళ్ళని మీరనుకుంటే ఇలా అనరు. యథా ప్రజా తథా రాజా నేటి నినాదం కావాలి. నేను చెప్పేదదే...

ఆ మాటలకు ఆగ్రహంతో ప్రభువు భ్రకుటి ముడివడింది.

"నేను ప్రజల కోసం ఎన్ని చేసానో తెలుసా...?" అన్నాడు.

"ఏం చేసారో చెప్పండి..."

"ఊరూరికీ కంప్యూటర్లు పంపాను. ఐ.టి.ని పెంచాను. క్షణాల్లో ఎక్కడి విషయాలైనా తెలుసుకునేట్లు చేసాను. కార్లు జరజరా పాకుతూ పోవడానికి ఓవర్ బ్రిడ్జీలు కట్టించాను..."

సగర్వంగా చెప్పాడు ప్రభువు...

"ఇవన్నీ ఎందుకు చేసారు...?"

"ప్రజల సుఖం కోసం..."

"సుఖమంటే...?" ప్రశ్నించాడు లక్ష్మయ్య...

కోపంగా చూసాడు ప్రభువు.

"నాకు తెలిసిన చిన్న కథ... మీరనుమతిస్తే చెబుతాను..."

"సరే చెప్పు..."

రాయలవారు కొలువుదీరున్నారు... సభ నిండా కవి, పండితులున్నారు... అంతా గొప్ప వాళ్ళే... మేధావులే...

"ఏది అన్నిటికంటే సుఖమైంది...?" ప్రశ్న తలెత్తింది.

పంచభక్ష్య పరమాన్నం తిని త్రేన్చడం అన్నాడో పండితుడు.

బొర్రనిండా హాయిగా తినడం కంటే సుఖ మేముంది...? పప్పు, చారు, రకరకాల కూర గాయలు, పెరుగు, గుత్తివంకాయ...లతో, స్వీట్లతో బాగా తినడమే సుఖం.

భోజన ప్రియులైన వాళ్ళంతా తిండిలో ఉన్న సుఖం ఎందులోనూ లేదు అని తేల్చే సారు.

'బాగా చెప్పారు...' అన్నారు రాయలవారు.

తెనాలి రామకృష్ణుడిపైకి రాయలవారి దృష్టి మరలింది.

"తెనాలి రామలింగకవీ...! సుఖమంటే ఏమిటో మీ అభిప్రాయం చెప్పరేంటి...?" అన్నారు.

"వాళ్ళంతా చెప్పారు కదా...! ఎందుకు లెండి..." అన్నాడు తెనాలి రామలింగకవి.

"మీరు కూడా చెప్పాలి..."

"చెప్పక తప్పదా...?"

"చెప్పి తీరాల్సిందే..."

"సుఖానికి వాళ్ళు చెప్పింది మాత్రమే నిర్వ చనం కాదు. బాగా తినడం కంటే కడుపులో బాగా ఒత్తిడి ఉన్నప్పుడు అదంతా ఖాళీ చేయడం అన్నిటినీ మించిన సుఖం..."

రామలింగకవి మాటలకందరూ నవ్వారు.

రాజుకతనిపై కోపం కూడా వచ్చింది.

"అన్ని వేళలా హాస్యమే నీకు... ఇదెలా సుఖమవుతుందో నిరూపించకపోతే నీ తల పోతుంది. వారం రోజులు గడువిస్తున్నాను..." అని సభ చాలించారు రాయలవారు.

నాలుగు రోజులయిపోయాయి... ఐదవ రోజు ఆ పండితులందరినీ తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు తెనాలి రామలింగ కవి. రకరకాల కూరలు, పప్పు, చారు, తీపి పదార్థాలు, గారెలు, కార, పకోడి మిర్చిలతో సుష్టుగా భోంచేసారు వాళ్ళు. విపరీతంగా పులుపు తినేట్లు జాగ్రత్తపడ్డాడు కవి. సురలు సేవించేదే కాబట్టి సురపానమూ ఏర్పాటు చేసాడు.

అర్ధరాత్రి దాటింది. ఎక్కడి వాళ్ళక్కడ ఆ గదిలో ఏర్పాటు చేసిన పడకల మీద నిద్రిం చారు.

వాళ్ళకు మెలకువ వచ్చేసరికి భళభళా తెల్లవారి చాలా పొద్దెక్కింది... కడుపులో ఒత్తిడి మొదలైంది.

అటు, ఇటూ చూసారు.

ఆ గదిలో నీళ్ళున్నాయి... రుచికరమైన రకరకాల తినుబండారాలున్నాయి... తలుపు తీయబోయారు. బయటగొళ్ళెం పెట్టుంది.

"రామలింగకవీ... తలుపుతీయి. దొడ్డికి పోవాలి..." మొత్తుకుంటున్నారు వాళ్ళు.

"ముందయితే మూత్ర విసర్జన చేసి నీళ్ళు తాగండి. ఆ తరువాత దొడ్డికి పోవచ్చు.." అన్నాడు కిటికీలోంచి చూస్తూ రామలింగకవి.

అతడన్నట్లు చేసారు వాళ్ళు.

కడుపులో ఒత్తిడి మరింత పెరిగింది.

"ఇందులో పాయఖానాలు లేవు. తలుపు తీయి. మేం త్వరగా దొడ్డికి పోవాలి..."

"దాందేముందండీ పండితవర్యులూ...! దొడ్డికి తర్వాత పోవచ్చు. ముఖం కడుక్కోండి.

వేడివేడి ఫలహారాలు సిద్ధంగా ఉన్నాయి కదా...! తినండి... తిండి ఎంత సుఖం? కానివ్వండి..."

నవ్వుతూ అన్నాడు రామలింగకవి...

"అయ్యయ్యో! రాత్రి తిన్న వివిధ పదార్థాలతో కడుపులో విపరీతంగా ఒత్తిడుంది. ముందయితే ఖాళీ చేయాలి. దయచేసి తలుపులు తీయి... భరించలేకుండా ఉన్నాం..."

"బయట తాళం వేసుంది. తాళం చెవి దొరకడం లేదు. ముందయితే ముఖం కడుక్కొని బాగా తినండి..."

"రామకృష్ణ కవీ...! దయచేసి తలుపులు తీయి. ఇపుడు తింటే చావే... తలుపులు తీయి..." మొత్తుకుంటున్నారు వాళ్ళు.

అయినా తలుపులు తెరవడం లేదు కవిగారు..

ఇంతలో కవి ఆహ్వానంపై రాయలవారు వచ్చారక్కడికి...

తలుపులు తెరిచాడు రామలింగకవి. తలో నీళ్ళముంత చేతికిచ్చి పంపించాడు.

వాళ్ళంతా కడుపులు ఖాళీ చేసుకొని తిరిగొచ్చారు...

"అబ్బ...! ఎంత సుఖంగా ఉంది...? ఎంత హాయిగా ఉంది...?" అన్నారు పండితులు.

"ఏది సుఖమో ఇప్పుడు చెబుతారా...?"

"నువ్వు చెప్పిందే నిజం రామలింగకవీ...!" అన్నారు ముక్తకంఠంతో పండితులు.

"భేష్ వికటకవీ... నువ్వన్న మాటలను ఇలా నిరూపించావన్న మాట..." మెచ్చుకున్నారు రాయలవారు.

అతనికి మంచి బహుమతి కూడా ఇచ్చారు... చెప్పడం ముగించాడు లక్ష్మయ్య పంతులు...

"రాయలవారు తెనాలి రామలింగకవికి బహుమతి ఇచ్చాడు కదా...! నీకు నేనూ ఓ బహుమతి ఇస్తాను. సరేనా..." అన్నాడు తెలివిగా ప్రజాస్వామ్యక ప్రభువు.

"యధా ప్రజా తధా రాజాగా పాలన ఉండాలన్నందుకు మీరు నాకు జైలు శిక్ష విధిస్తారని తెలుసు. ఎంతయినా మీరు ప్రజాస్వామ్య ప్రభువులు కదా...!"

అని చేతులు చాచాడు లక్ష్మయ్య పంతులు.

"ఆరు నెలల్లో ఎన్నికలున్నాయి. అప్పటిదాకా నువ్వు జైల్లోనే ఉండాలి. నీలాంటి వాళ్ళు బయటుంటే మాకు ప్రమాదం..."

లక్ష్మయ్యకు జైలు శిక్ష విధించి వికటాట్టహాసం చేసాడు ప్రభువు...

ఆరు నెలలు గడిచాయి...

ఎన్నికలు అయిపోయాయి...

ఆ రోజే ఎన్నికల ఫలితాలు బయట పడతాయి.

లక్ష్మయ్యను ప్రభువు దగ్గరికి తెచ్చారు భటులు.

అతన్ని చూసి పకపకా నవ్వుతున్నాడు ప్రభువు.

"ఏం దొరికింది ప్రభూ...! అంతగా నవ్వుతున్నారు...?" అతి మామూలుగా అన్నాడు లక్ష్మయ్య.

"లవణమన్న... లక్షాధికార్లు... ఏం పాండిత్యం...? దొడ్డికి పోతే సుఖం... నీ మాటలు నవ్వులాటగా లేవా...? ఈ ఎన్నికల్లో మేం నూటికి నూరుపాళ్లు మెజారిటీతో గెలువబోతున్నాం..."

మరింత బిగ్గరగా నవ్వుతూ అన్నాడు ప్రభువు.

"నవ్వండి ప్రభూ...! ఇంకొన్ని గంటల్లో మీ బతుకులెలాగూ నవ్వులపాలు కాబోతున్నాయి... అప్పుడెలాగూ ఏడ్వడమే కదా...!"

"అంటే...?"

"మీరు చిత్తు చిత్తుగా ఓడిపోబోతున్నారు..."

"ఆరు నెలలుగా నువ్వు జైల్లోనే ఉన్నావు కదా...! బయటి ప్రపంచంతో సంబంధం లేదు కదా...! మేం ఓడిపోతామని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావు...?" కోపంగా అన్నాడు ప్రభువు.

"ప్రజాస్వామ్యంలో యధా ప్రజా తధా రాజా అనే విధంగా ప్రజాభీష్టానికి, ప్రజావసరాలకూ అనుగుణంగా ఉండకుంటే ఎవరి గతయినా అంతే...

కోట్లాదిమంది ఆకలితో అలమటిస్తూంటే కంప్యూటర్లు తినండి అన్నారు మీరు. కోట్లమందికి నీరు కూడా సరిగ్గా అందే పరిస్థితులు లేకున్నా సెల్‌ఫోన్లున్నాయంటే ఎలా...? నిలువనీడలేని వాళ్ళను అలాగే వదిలి ఫ్లైఓవర్లు కడితే లాభమేంటి...? ప్రజలు కోరుకున్న లవణమన్నం మీరివ్వలేదు...

మరో దిక్కు విపరీతంగా తిని అజీర్తితో, బైటకు పోవడానికి సిద్ధంగా ఉన్న వాళ్ళముందు పంచభక్ష్య పరమాన్నాలుంచారు... ఇరువైపులా ప్రాధాన్యతా క్రమాలను విస్తరించారు కాబట్టే మిమ్మల్ని ప్రజలు తిరస్కరిస్తున్నారు.

ఇంకో రెండు మూడు గంటల్లో విషయం తెలిసిపోతుంది కదా...! అంతవరకూ నేనిక్కడే ఉంటాను..."

అని మఠం వేసుకొని కూర్చున్నాడు లక్ష్మయ్య పంతులు.. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి...

ప్రభువు ముఖంపై నుంచి నవ్వు మాయమవుతోంది...

మరికొంత సేపట్లో ఫలితం స్పష్టమైపోయింది...

ప్రభువు ముఖం మీద కత్తివేటకు నెత్తురు చుక్కలేదు...

"లక్షాధికారయిన లవణమన్నమె కాని వెండి బంగారంబు కుడువలేడు..." పాడుకుంటూ వెళ్ళిపోబోతున్నాడు లక్ష్మయ్య...

"లక్ష్మయ్య పంతులూ నువ్వు పోతున్నదెక్కడికి...?" ప్రశ్నించాడు మాజీ ప్రభువు...

"గెలిచిన వారి దగ్గరికి..."

"ఎందుకు...? "

"యధా ప్రజా తధా రాజా తత్వం బోధించడానికి... గెలిచిన తరువాత 'హిట్లర్' కావద్దని హెచ్చరించడానికి... లవణమన్నం మీద దృష్టిపెట్టకుంటే ఎవరికైనా ఇదే గతి పడుతుందని నొక్కి చెప్పడానికి..." అన్నాడు లక్ష్మయ్య పంతులు.

"లక్షాధికారయిన లవణమన్నమెకాని వెండి బంగారంబు కుడియలేడు..." గొంతెత్తి పాడుతూ వెళ్తున్నాడు...

●

## డిఫరెన్స్

ఒకపెద్ద కంపెనీ ఆఫీసులోకి ఒక వగలాడి విసురుగా వచ్చింది - 'మేనేజింగ్ డైరెక్టర్' ఎక్కడంటూ!

ఆమెకు ఎండీగారి పియ్యే ఎండీరూం చూపిస్తూ, 'ఏం ఆయన్ని వల్లో వేసుకోవాలని ట్రై చేస్తున్నావా? ఒళ్ళు ఛీరేస్తా'నంది.

దానికి ఆ వగలాడి మరింత కోపంగా 'ఏడిశావ్! నేనేమీ కొత్త టైపిస్టునో, పియ్యేనో అనుకొన్నావా? మీ బాసు పెళ్ళాన్ని జాగ్రత్త' అంది.

ఇక చూడాలి ఆ పియ్యే మొఖం.